

వీఎంఆర్‌డీఏ పరిధి నుంచి చోడవరానికి విముక్తి కల్పిస్తా..
- మునిసిపాలిటీ అవసరం లేదు
- త్వరలోనే బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

- వార్త 7వ పేజీలో..

దడ పుట్టించే దారులు

గోతులమయంగా జిల్లాలోని పలు రహదారులు

- వాహనచోదకులకు నిత్యం పాట్లు
- గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోని వైనం
- 150 కిలో మీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు
- మరమ్మతులకు రూ.2.09 కోట్లు అవసరమని కూటమి ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదనలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు గ్రామాల్లో రహదారులు దారుణంగా ఉన్నాయి. భారీ గోతులతో దర్శనమిస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా రహదారులకు మరమ్మతులు చేయించకపోవడంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది.



రావికమతం మండలం మేడివాడలో ఆంజనేయస్వామి గుడికి సమీపంలో భారీ గొయ్యి

జిల్లాలో అనకాపల్లి, గొలుగొండ, నాతవరం, చోడవరం, కె.కోటపాడు, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, సబ్బవరం కె.కోటపాడు మండలాల్లో రోడ్లు ఘోరంగా తయారయ్యాయి. అనకాపల్లి నుంచి తుమ్మపాల, దర్జీనగర్ మీదుగా వెంకన్నపాలెం వెళ్లే మెయిన్ రోడ్డుపై పెద్ద గోతులు ఉండడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. చోడవరం మీదుగా బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట బీఎన్ రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మొత్తం ఈ రోడ్డు 30 కిలో మీటర్ల మేర గోతులతో దర్శనమిస్తోంది. మాడుగుల నియోజకవర్గం పరిధిలో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కాశీపురం వరకు, అలాగే రావికమతం మండలం బీఎన్ ప్రధాన రోడ్డు నుంచి మేడివాడ పెద్దచెరువు వరకు రోడ్డు చెరువును తలపిస్తున్నాయి. మేడివాడ పాల కేంద్రం, ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న పెద్ద గొయ్యిలో నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కూడలి వద్ద, సబ్బవరం నుంచి వయా అనకాపల్లి, లంకెలపాలెం మీదుగా పరవాడ వెళ్లే రోడ్డుపై అడుగుకో గొయ్యి ఉంది. మాడుగుల మండలం వడ్డాది నుంచి పాడేరు వెళ్లే రోడ్డులో కూడా ఇదే పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రహదారుల నిర్వహణపై కనీసం దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అనకాపల్లి- చోడవరం మార్గంలో దర్జీనగర్ సమీపంలో రహదారి ఇలా..

రూ.2.09 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో మొత్తం 1,402 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, 150 కిలో మీటర్ల మేర అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్ల తక్షణ మరమ్మతులకు రూ.2.09 కోట్లు అవసరమని ఆర్ అండ్ బీ ఇంజనీర్లు అంచనాలు రూపొందించి రెండు రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపారు. 69 కిలోమీటర్ల వరకు భారీ గోతులు ఏర్పడ్డాయని, దీని మరమ్మతులకు రూ.80 లక్షలు, అత్యవసర మరమ్మతుల కోసం సుమారు 60 కిలోమీటర్ల రోడ్లకు రూ.89 లక్షలు, 11.4 కిలోమీటర్ల పొడవున ప్యాచ్ వర్కులకు రూ.29 లక్షల అంచనాలతో ప్రభుత్వాని ప్రతిపాదనలు పంపారు. అదే విధంగా దెబ్బతిన్న జాతీయ రహదారులు సుమారు 10 కిలోమీటర్ల మేర మరమ్మతులకు రూ.11 లక్షలు అవసరమని అంచనాలతో ప్రతిపాదనలు పంపారు.

జోన్‌లో ప్రధాన పోస్టులు ఖాళీ

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో సకాలంలో అందని సేవలు

- భర్తీపై దృష్టి పెట్టని గత వైసీపీ ప్రభుత్వం

అనకాపల్లి టౌన్, జూలై 29:

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో పరిపాలన పరంగా అతి కీలకమైన పోస్టులు కొంతకాలంగా ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలువురు అధికారులు పదవీవిరమణ పొందడం, పలువురు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ విభాగాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పోస్టులను భర్తీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.



జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం

స్థానిక టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీపీ, టీపీవో, టీపీఎస్, ఇద్దరు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. కానీ ఏసీపీ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. టీపీవో పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండగా, టీపీఎస్ జనార్దన్ మే 31వ తేదీన పదవీవిరమణ పొందడంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోన్‌కు పర్మినెంట్ సర్వేయర్ కూడా లేరని ఆఫీస్ వర్గాలు చెబుతున్నాయి. ఆర్వో పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా ఉన్న సురేశ్ ఆర్వో బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారని కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అనకాపల్లిలో అతి ముఖ్యమైన శానిటేషన్ విభాగం పరిస్థితి మరింత దారుణంగా ఉంది. హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ నాగేశ్వరరావు కొన్నేళ్ల క్రితం పదవీవిరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. అడపాదడపా హెల్త్ ఆఫీసర్ స్థానంలో అధికారులను నియమిస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అధికారి లేరు. ప్రస్తుతం కూడా యూసీడీ విభాగం ఏపీడీ దొర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో డీఈగా పనిచేసిన వేణుగోపాలరావు ఇటీవల పదవీవిరమణ పొందారు. ఆ పోస్టులో కొత్తగా ఎవర్నీ నియమించలేదు. అనకాపల్లిలోని ఐదు వార్డులకు ఐదుగురు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. అయితే ఒక్కరే ఉన్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉండడంతో శానిటేషన్ మేస్త్రీలను ఇన్‌చార్జులుగా పెట్టి పనులు చేయిస్తున్నారు. అనకాపల్లి మునిసిపాలిటీగా ఉన్నప్పుడు పారిశుధ్య కార్మికుల సంఖ్య 280 ఉండేది. 2013లో జీవీఎంసీలో విలీనమైనప్పటి నుంచి కార్మికులు రిటైర్ అవుతున్నారే తప్ప వారి స్థానంలో కార్మికులను నియమించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం రెగ్యులర్ కార్మికులు 100 మంది వరకు ఉండగా, మరో 100 మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నట్టు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయమై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును వివరణ కోరగా జీవీఎంసీలోని ఖాళీ పోస్టుల వివరాలు, ఇక్కడి పరిస్థితులను కమిషనర్ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.



టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

నేడు ఏయూకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి

- వీసీతో పాటు అధికారులతో సమీక్ష

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్‌కుమార్ గౌర్ మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీకి రానున్నారు. వీసీతో పాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. సౌరబ్‌కుమార్ రాక నేపథ్యంలో హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది ఉదయం 8.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వర్సిటీకి వస్తుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక్కడి వ్యవహారాలను నేరుగా పరిశీలించి విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు నివేదిక సమర్పించే అవకాశం ఉంది. మంత్రి సూచనల మేరకే ఆయన వస్తున్నట్టు చెబుతున్నారు. సౌరబ్ కుమార్ వచ్చి వెళ్లిన తరువాత వర్సిటీలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా గత పాలకుల అడ్డగోలు వ్యవహారాలు, నియామకాలు, నిధులు దుర్వినియోగంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించనుందని ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా వర్సిటీలోని ఇబ్బందులు, గత పాలకులు చేసిన అడ్డగోలు వ్యవహారాలు, నియామకాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

నిర్మాణంలో నాణ్యత లేని అర్బన్ పీహెచ్‌సీ

ప్రారంభించిన ఆరు నెలలకే శ్లాబ్ లీకేజీ సమస్య

- తలుపులకు పగుళ్లు, ఊడిపోతున్న కిటికీ రెక్కలు
- కనీస సదుపాయాలు లేక సిబ్బంది, రోగుల అవస్థలు

నర్సీపట్నం, జూలై 29:

నర్సీపట్నం అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. ఈ భవనాన్ని ప్రారంభించి ఆరు నెలలు గడవక ముందే నిర్మాణంలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. అసౌకర్యాల నడుమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.



కిటికీ రెక్క ఊడిపోయిన దృశ్యం



నర్సీపట్నం అర్బన్ పీహెచ్‌సీ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ఏడో వార్డు ఆలేటి జమ్మయ్యవీధిలో రూ.1.8 కోట్లతో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు అంటే జనవరి 30వ తేదీన అప్పటి ఎమ్మెల్యే పెట్ల గణేశ్ ఆస్పత్రి భవనాన్ని హడావిడిగా ప్రారంభించారు. ప్రారంభించి ఆరు నెలలు గడవక ముందే నిర్మాణంలో నాణ్యతా లోపం బయటపడుతున్నాయి. మరుగుదొడ్ల వద్ద ఫ్లోరింగ్ టైల్స్ పగిలిపోయాయి. కిటికీ రెక్కలు, తలుపు గెడలు ఊడిపోతున్నాయి. శ్లాబ్ ఫ్లోరింగ్ సిమెంట్ పనుల్లో నాణ్యతా లోపం వల్ల వర్షపు నీరు నిలిచిపోయి గదుల్లోకి నీరు వచ్చేస్తోంది.

గోదామా?.. ఆస్పత్రి భవనమా?..

ఇక్కడి భవనం పరిస్థితి చూస్తే ఆస్పత్రి కోసం కట్టారా?, లేక గోదాము కోసం నిర్మించారా? అనే అనుమానం కలుగుతుంది. ఎక్కడా ఒక్క అల్మరా, బీరువాలు ఏర్పాటు చేయలేదు. దీంతో మందులు పెట్టుకోవడానికి అవకాశం లేక ఎక్కడబడితే అక్కడ చిందరవందరగా నేలపై పడేసి ఉంటున్నాయి. సమావేశ మందిరం మొత్తం మందుల పెట్టెలతో నిండిపోవడంతో వాటి మధ్య కుర్చీలు వేసుకొని సిబ్బంది సమావేశం నిర్వహిస్తున్నారు. ఇక నీటి సరఫరా పైప్‌లైన్ సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం వల్ల మరుగుదొడ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రికి వచ్చే రోగులకు, సిబ్బందికి కనీసం తాగునీరు ఏర్పాటు చేయలేదు. వైద్యాధికారి గదిలో చేతులు శుభ్రం చేసుకోవడానికి వాష్ బేసిన్, కొళాయి, నీటి సదుపాయం ఏర్పాటు చేయలేదు. రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లో కూడా వాష్ బేసిన్, నీటి సదుపాయం లేక బక్కెట్లతో నీరు తెచ్చుకుంటున్నారు. భవనానికి త్రీఫేజ్ విద్యుత్ ఏర్పాటు చేయలేదు. పక్కన ఉన్న వాటర్ ట్యాంక్‌కి ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ విద్యుత్ మీటర్ నుంచి తాత్కాలికంగా విద్యుత్ వాడుకుంటున్నారు. నిర్మాణ పనుల్లో మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. భవనం డిజైన్ చేసేటప్పుడు ఆస్పత్రిలో ఉండాల్సిన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. బోరు నీరు రావడం లేదని, రోగులకు తాగునీరు లేదని తెలిసి కూడా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి.

కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు



ఉద్యోగిని మృతిపై ఆందోళన

- తీయనయూన్ గార్మెంట్స్ యాజమాన్యం వేధింపులే కారణమని ఆరోపణ
- బ్రాండిక్స్ గేటు వద్ద కుటుంబ సభ్యులు, కర్మాగారంలో తోటి కార్మికుల నిరసన




మృతురాలు మాధురి(ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, జూలై 29: తీయనయూన్ గార్మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న నక్కా మాధురి(19) యాజమాన్యం వేధింపుల వల్లే మృతి చెందిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు, తోటి ఉద్యోగులు సోమవారం బ్రాండిక్స్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేశారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించడంతో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునగపాక మండలం అరబుపాలేనికి చెందిన మాధురి బ్రాండిక్స్ ఆవరణలో గల తీయనయూన్ గార్మెంట్స్ కర్మాగారంలో నాలుగు రోజుల క్రితం నుంచి విధులకు హాజరవుతోంది. అయితే గత శుక్రవారం ఆమె విధుల్లో ఉండగా వాష్‌రూమ్‌కి వెళ్లి ఆలస్యంగా వచ్చిందన్న నెపంతో కర్మాగారం ప్రతినిధులు ఆమెను తీవ్రంగా హెచ్చరించారు. అంతేకాక కర్మాగారం ప్రధాన గేటు వరకు తీసుకువచ్చి వదిలేశారు. తన గ్రామానికి వెళ్లడానికి ఖర్చులకు కూడా డబ్బులు లేవని, ఏదైనా వాహనంపై తన గ్రామానికి పంపాలని మాధురి వేడుకున్నా సిబ్బంది వినిపించుకోలేదు. ఏదో విధంగా మాధురి తన ఇంటికి చేరుకొని తీవ్ర మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం అంత్యక్రియలు చేశారు. సోమవారం బ్రాండిక్స్ ప్రధాన గేటు వద్ద మాధురి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగగా, సెక్యూరిటీ అడ్డుకున్నారు. అలాగే సోమవారం ఉదయం నుంచి బ్రాండిక్స్ ఆవరణలో కర్మాగారం వద్ద తోటి కార్మికులు ఆందోళన చేస్తున్నారు. యాజమాన్యం ఈ విషయం బయటకు రాకుండా మేనేజ్ చేస్తున్నారని, కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న వారిని కూడా బయటకు పంపడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి

... మిగతా 8వ పేజీలో

స్టాండింగ్ కమిటీకి 15 నామినేషన్లు

- కూటమి నుంచి పది, వైసీపీ నుంచి ఐదు
- నామినేషన్లు దాఖలుకు నేడు చివరిరోజు



స్టాండింగ్ కమిటీకి నామినేషన్లు వేస్తున్న కూటమి కార్పొరేటర్లు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి 15 మంది కార్పొరేటర్లు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో పది మంది కూటమి తరఫున, ఐదుగురు వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలుకు మంగళవారంతో గడువు ముగుస్తుంది. కూటమి తరఫున పది మంది అభ్యర్థులను ఎంపిక చేయడానికి మూడు పార్టీల నేతలు గత మూడు రోజులుగా తీవ్రస్థాయిలో కసరత్తు చేశారు. ఆశావహులు ఎక్కువ మంది ఉండడంతో వారందరినీ బుజ్జగించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. పోటీకి అవకాశం దక్కని కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు కేకలు వేసుకున్నారు. ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని అసంతృప్త కార్పొరేటర్లను బుజ్జగించడంతో నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం తొలగింది. కూటమి నుంచి నొల్లి నూకరత్నం (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మీబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిల్ల మంగమ్మ (ఏడో వార్డు), ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు) నామినేషన్లు దాఖలు చేసినట్టు జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు.

క్రైం... crime news

లింగంపేటలో కారు దగ్ధం


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర

కృష్ణాదేవిపేట, జూలై 29: గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన పానింటిల్లి మంగ రాజుకు చెందిన బ్రీజా కారు ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? లేదా ఎవరైనా గుర్తు తెలియన వ్యక్తులు దగ్ధం చేశారని అనుమానంతో బాధితుడు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఉదయం కారును ఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

మునగపాక (తుమ్మపాల), జూలై 29: మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని ఒంపోలుపేటకు చెందిన నక్కా సత్యనారాయణ కుమార్తె నక్కా మాధురి(19) తనను కొందరు అవహేళన చేశారని మనస్తాపం చెంది శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మాధురి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో ఒకరికి యావజ్జీవ శిక్ష

కశింకోట/పాయకరావుపేట, జూలై 29: హత్య కేసులో నేరం రుజువు కావడంతో పాయకరావుపేటకు చెందిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ సోమవారం అనకాపల్లి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనికి సంబంధించి కశింకోట సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాయకరావుపేటకు చెందిన రెడ్డం నరేశ్‌కుమార్(35) స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తూ అదే స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న సూరవు ఇందిరను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొంతకాలం సహజీవనం సాగించాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తున్న ఇందిరను అంతమొందించాలని నిర్ణయించుకున్న అతను 2017 మార్చి 19వ తేదీన కశింకోట మండలం కన్నూరుపాలెంలో రాజుగారి లేఅవుట్ వద్దకు తీసుకు వెళ్లాడు. అక్కడ ఆమెను విచక్షణారహితంగా బ్లేడుతో కోసి, పెట్రోల్‌పోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదుచేసిన కశింకోట పోలీసులు నిందితుడు నరేశ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి అనకాపల్లి రూరల్ సీఐ జి.రామచంద్రరావు కేసు దర్యాప్తు చేయగా, అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో వాదోపవాదనలు జరిగిన తరువాత నేరం రుజువుకావడంతో జడ్జి నందనవనం శ్రీవిద్య సోమవారం నరేశ్‌కుమార్‌కి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

నేటి నుంచి ఏయూ దూరవిద్య పరీక్షలు

- కొన్ని కేంద్రాల్లో డబ్బులు వసూలు?

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూర విద్య కేంద్రం విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెలాఖరు వరకు పరీక్షలు జరగనున్నాయి. ఎంఏ, ఎంబీఏ, ఎంకాం విద్యార్థులకు మొదటి, రెండు, మూడు సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. అయితే, ఈ పరీక్షలను క్యాష్ చేసుకునేందుకు అనేక కళాశాలలు సిద్ధమయ్యాయి. పరీక్ష కేంద్రాలు కలిగిన కొన్ని కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలుచేసి ప్రశ్నపత్రాలను ముందుగానే లీక్ చేస్తున్నాయి. ఈ తరహా వ్యవహారాలకు ఆస్కారం లేకుండా ఏయూ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై వివరణ కోరేందుకు యత్నించగా ఏయూ దూర విద్యా సంచాలకులు అందుబాటులోకి రాలేదు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో పేపర్లు ముందుగానే విద్యార్థులకు చేరుతున్నాయని తెలిసింది. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సమాధానాలు ఒకేలా ఉంటున్నాయి. గతంలో నిర్వహించిన పరీక్షల వాల్యూయేషన్‌కు వెళ్లిన అధ్యాపకులు జవాబుపత్రాలు చూసి ఆశ్చర్యపోయారు. ఆయా కేంద్రాల్లో ముందుగానే పేపర్ లీక్ చేయడం లేదా మాస్‌కాపీయింగ్ అవకాశం కల్పించడమే కారణంగా చెబుతున్నారు. దూర విద్యా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

పప్పల చలపతిరావుకు అయ్యన్న పరామర్శ


పప్పల చలపతిరావును పరామర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రాంబిల్లి, జూలై 29 : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత పప్పల చలపతిరావును సోమవారం సాయంత్రం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పరామర్శించారు. రాంబిల్లి మండలం దిమిలిలోని చలపతిరావు ఇంటికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులతో కలిసి వెళ్లారు. చలపతిరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

విరగ్గాసిన డ్రాగన్ ఫ్రూట్

- వాణిజ్య పంటలపై దృష్టి సారించిన గిరిజనులు
- గత ఏడాది మూడు టన్నులు దిగుబడి
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరి రైతు


ఫ్రూట్‌ను సేకరిస్తున్న గిరిజనుడు

అనంతగిరి, జూలై 29: మన్యంలోని వాణిజ్య పంటలపై గిరిజనులు దృష్టి సారించడంతో లాభాలను ఆర్జిస్తున్నారు. మన్యం వాతావరణం వాణిజ్య పంటలకు అనుకూలించడంతో గిరిజన రైతులు డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెరీ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్రగుడ గ్రామ సమీపంలోని జన్ని సుబ్బారావు అనే గిరిజనుడు 2019లో రెండున్నర ఎకరాల్లో రూ.5 లక్షలతో డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రారంభించాడు. రెండేళ్లపాటు అంతంతమాత్రంగానే ఫ్రూట్ దిగుబడి ఉండేది. అయినా నిరాశ చెందలేదు. గత రెండేళ్లుగా ఒక్కసారిగా దిగుబడి పెరిగింది. ఏడాదికి మూడు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. వీటిని అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని స్టాల్స్ పెట్టి కిలో రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. అంతేకాకుండా ఆ మార్గంలో వెళ్లే పర్యాటకులు, స్థానికులు డ్రాగన్ ఫ్రూట్‌ను కొనుగోలు చేస్తున్నారు. చూడడానికి పువ్వు ఆకృతిలో ఉండే ఈ పళ్లను పిటాయి, స్ట్రాబెర్రీ పియర్‌గా పిలుస్తుంటారు. శ్వాసకోశ, దంత సమస్యలు, మెదడు వ్యాధులు, మలబద్ధకం, గుండె సంబంధిత వ్యాధుల నివారణకు ఈ పండు ఉపయోగపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో సీ విటమిన్ ఉంటుంది. ఇక్కడ పండిన డ్రాగన్ ఫ్రూట్‌ను విశాఖపట్నంలోని పర్యాటక ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు రైతు జన్ని సుబ్బారావు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	82.00
లైవ్ ధర	102.00
విత్ స్కిన్	174.00
స్కిన్ లెస్	184.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- అవే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న పరవాడ మండలం దేశపాత్రునిపాలెం వాసులు

తుమ్మపాల, జూలై 29 : అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి 283 అర్జీలు అందాయన్నారు. వాటిలో రెవెన్యూశాఖకు 166, పోలీస్‌శాఖకు 15, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సుకు సంబంధించి 16, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 15, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు నాలుగు, రూరల్ డెవలప్‌మెంట్‌కు ఏడు, ఇతర విభాగాలకు సంబంధించి 83 అర్జీలు అందాయన్నారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన దివ్యాంగుడైన కె.దీపక్ తనకు ప్రాణహాని ఉందంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక హత్య కేసులో సాక్షిగా ఉన్న తనను నిందితులు చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్యుతాపురం మండలం చౌడపల్లిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 15 ఎకరాల్లో అక్రమ లేఅవుట్‌లను వేసి 200 కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, అధికారులు తక్షణమే కాపాడాలని విశాఖకు చెందిన పీఎల్‌వీఎన్ మూర్తి ఫిర్యాదు చేశారు. వీటితో పాటు మరిన్ని ఫిర్యాదులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, అధికారులు పాల్గొన్నారు. కాగా పరవాడ మండలం దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలో రూ.400 కోట్ల విలువైన సుమారు 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని, అధికారులు తక్షణమే ఆ భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనకాపల్లి జిల్లా కింతలి వల్లాపురం పంచాయతీ పరిధి శరభన్నపాలెంలో ఏళ్ల తరబడి కొండపోరంబోకు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నా ఇంతవరకు ప్రభుత్వం పట్టాలు అందించలేదని, ప్రభుత్వం తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు ఆందోళన చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- ఎస్పీ ఎం.దీపిక

తుమ్మపాల, జూలై 29: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 47 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయబాస్కర్, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదీతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

డొక్కా సీతమ్మ వంశస్థురాలికి సత్కారం


రాణీ అమ్మాజీని సత్కరిస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, జూలై 29: ప్రభుత్వ బడుల్లో పిల్లలకు సోమవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ వంశానికి చెందిన నక్కపల్లి హైస్కూల్ హెచ్ఎం రాణీ లలితను ఎంఈవో కె.నరేశ్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీను, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కక్కిరాల సురేశ్, అడ్డూరి లోవరాజు, కొప్పిశెట్టి వీరబాబు, పచ్చిపులుసు నాగేశ్వరరావు, అడ్డూరి చిన్న, అల్లాడ తాతారావు, కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



మేం డొక్కా సీతమ్మ వంశానికి చెందిన వాళ్లం. మా తండ్రి రాణీ నర్సింహమూర్తి డొక్కా సీతమ్మకు మనుమడు అవుతారు. తరాలు మారినా డొక్కా సీతమ్మ వంశీకురాలిగా నేను వున్నందుకు చాలా గర్వంగా వుంది. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి ఆ పేరు పెట్టడం చెప్పలేనంత ఆనందంగా వుంది. ఆ మహాతల్లి అన్నపూర్ణగా చరిత్రలో నిలిచిపోయింది.

- రాణీ అమ్మాజీ, డొక్కా సీతమ్మ వంశస్థురాలు

వీఎంఆర్‌డీఏ పరిధి నుంచి చోడవరానికి విముక్తి కల్పిస్తా

- మునిసిపాలిటీ అవసరం లేదు
- త్వరలోనే బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న వడ్డాది జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్

చోడవరం, జూలై 29: వీఎంఆర్‌డీఏ పరిధి నుంచి చోడవరం నియోజకవర్గానికి విముక్తి కల్పిస్తామని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ అర్బన్ పరిధిలో చోడవరం నియోజకవర్గంలోని చాలా ప్రాంతాలను వైసీపీ హయాంలో విలీనం చేశారన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉండడంతో పంచాయతీ ఆదాయంతో పాటు సామాన్యులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నదన్నారు. అందువల్ల వీఎంఆర్‌డీఏలో కలిపిన మండలాలను తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చోడవరం పట్టణంలో కూడా ఎక్కువ శాతం పేదలు ఉన్నారని, ఇటువంటి ప్రాంతాన్ని మునిసిపాలిటీ చేయడం వల్ల కూడా ప్రయోజనం ఉండదని, పైగా పన్నుల భారం కూడా పెరిగిపోతుందన్నారు. అందువల్ల మునిసిపాలిటీని కూడా కానివ్వబోమని స్పష్టం చేశారు.

బీఎన్ రోడ్డు కష్టాలకు త్వరలోనే మోక్షం

బీఎన్ రోడ్డులో మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, సంబంధిత కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడామని ఎమ్మెల్యే రాజు తెలిపారు. బీఎన్ రోడ్డుకు మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వం వేరే పనులకు మళ్లించిందని, ఆ నిధులను తిరిగి వెనక్కి తెప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. బీఎన్ రోడ్డులో వడ్డాది వద్ద వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. పూర్తి స్థాయి పనులు చేపట్టేలోగా ప్రజలకు ఇబ్బంది లేకుండా మరమ్మతు పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే నియోజకవర్గానికి రూ.30కోట్ల మేర ఉపాధి నిధులు వచ్చే అవకాశం ఉందని, ఈ నిధులతో నాలుగు మండలాల్లో పనులు చేపట్టనున్నామని ఎమ్మెల్యే రాజు వివరించారు. వడ్డాది జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా నియమితులైన వై.అన్నపూర్ణ సోమవారం ఎమ్మెల్యే రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేను సత్కరించారు.

అప్పన్నకు 350 గ్రాముల స్వర్ణ హారం బహూకరణ


స్వర్ణ హారాన్ని అధికారులకు అందజేస్తున్న భక్తుడు సూర్యచంద్రరావు

సింహాచలం, జూలై 29: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక సందర్భాల్లో అలంకరణకు వినియోగించాలని కోరుతూ విశాఖ నగర పరిధిలోని మధురవాడ ప్రాంతానికి చెందిన భక్తుడు కె.సూర్యచంద్రరావు సోమవారం స్వర్ణ హారాన్ని బహూకరించారు. అధికారులు హారాన్ని తూకం వేసి 350 గ్రాములు ఉన్నట్టు నిర్ధారించారు. దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తికి సూర్యచంద్రరావు ఆ హారాన్ని అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వారి గోత్రనామాలతో పూజలు జరిపించారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఆలయ ఏఈఓ ఆనందకుమార్ దాతను శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

సింహాచలం, జూలై 29 : వరాహలక్ష్మీ నృసింహస్వామికి గత 33 రోజులకు హుండీల ద్వారా రూ.1.97 కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంత్‌కుమార్, గ్రేడ్-1 ఈఓ నీలిమ పర్యవేక్షణలో సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో సిబ్బంది హుండీల లెక్కింపు చేపట్టారు.రూ.1,97,06,300 నగదు లభించగా, స్వర్ణం 100 గ్రాములు, రజితం 11 కిలోల 800 గ్రాములు ఆభరణాల రూపంలో సమకూరింది. అలాగే 163 యూఎస్ఏ డాలర్లు, యూఏఈకి చెందిన 5 దీరమ్స్, నాలుగు సింగపూర్ డాలర్లు, పది ఆస్ట్రేలియా డాలర్లు, ఇరవై కెనడా పౌండ్లు, 40 ఖతార్ రింగిట్స్, 21 సౌదీ అరేబియా రియల్స్, కువాయిట్‌కు చెందిన 1.5 దీనార్స్, 50 నేపాల్ రుపీస్, 26 మలేషియా షిల్లింగ్స్ తదితర విదేశీ కరెన్సీ కూడా స్వామివారి ఖజానాకు చేరింది.

నేవీ రోడ్డు గోతులమయం


అప్పన్నపాలెం చర్చి జంక్షన్ వద్ద ఏర్పడిన గొయ్యి



రాంబిల్లి, జూలై 29: మండలంలోని ప్రధాన నేవీ రోడ్డు గోతులమయంగా ఉంది. రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీ ఏర్పాటు కావడంతో పదేళ్ల క్రితం వెంకటాపురం జంక్షన్ నుంచి వాడనర్సాపురం సమీపంలోని నేవీ గేటు వరకు సుమారు 12 కిలోమీటర్లు దూరం వరకు నేవీ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డులో వాహనాలు రాకపోకలు అధికంగా ఉండడంతో గత ఐదేళ్లుగా రోడ్డు పొడవునా గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిసినప్పుడు ఈ గోతుల్లో నీరు చేరి ఏది రోడ్డో, ఏ గొయ్యో తెలియని పరిస్థితి నెలకొంటోంది. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

డైరెక్టర్ దృష్టికి గిరిజన సంక్షేమ టీచర్ల సమస్యలు

- టీడబ్ల్యూటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ


అమరావతిలో టీడబ్ల్యూ డైరెక్టర్ పి.నవ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడబ్ల్యూటీఏ నేతలు

పాడేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ పినవ్యకు గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలపై సోమవారం అమరావతిలో వినతిపత్రం సమర్పించామని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ స్థానిక విలేకరులకు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, ప్రధానంగా అరులైన సీనియర్ టీచర్లను ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు కల్పించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో టీచర్ల రాత్రి బసను తొలగించాలని, గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శేషగిరిరావు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, వివిధ జిల్లాలకు చెందిన నేతలు పోసయ్య, గాంధీబాబు, మంగిరెడ్డి, సింగరాజు, గంగరాజు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మావోలకు వ్యతిరేకంగా ఆదివాసీల ర్యాలీ


మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న ఆదివాసీలు

గూడెంకొత్తవీధి, జూలై 29: మావోయిస్టులారా.. అమరవీరుల వారోత్సవాలు ఎవరి కోసమంటూ సోమవారం గిరిజన యువత మండల కేంద్రంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. మా గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటున్న మావోయిస్టులను తరిమి కొడతామని ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

పిల్లల్లో భక్తిభావం పెంపొందించాలి

- ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు


ప్రవచనం చేస్తున్న గరికిపాటి

అనకాపల్లి టౌన్, జూలై 29 : పిల్లల్లో భక్తి భావాన్ని తల్లిదండ్రులు పెంపొందించాలని ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక వుప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపం ఆవరణలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆయన ప్రవచనం చేశారు. ముందుగా ఆలయంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కల్యాణ మండపం ఆవరణలో ఆయన ప్రవచనం చేస్తూ ప్రతి ఒక్కరూ నుదుటిపై కుంకుమ బొట్టు పెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో- చైర్మన్ డాక్టర్ గ్రంథి శేషుకుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

పశుగణనపై ప్రాంతీయ సదస్సు రేపు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో త్వరలో చేపట్టనున్న పశుగణనపై ఈనెల 31వ తేదీన నగరంలోని ఒక హోటల్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు పశు సంవర్ధక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ సదస్సుకు ఏపీ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరవుతారని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

విద్యా వ్యవస్థలో సమస్యగా మారిన జీవో 117ను రద్దు చేయాలి

ఏపీటీఎఫ్ ప్రతినిధుల డిమాండ్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఫెడరేషన్ ప్రతినిధులు

రాంబిల్లి, జూలై 29 : విద్యా వ్యవస్థలో సమస్యగా మారిన జీవో 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ కోరారు. రాంబిల్లి, దిమిలి, లాలంకోడూరు, కొత్తూరు, కొత్తపట్నం, కేజీబీవీ, కొత్తూరు హైస్కూళ్లలో సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఫెడరేషన్ రాజీలేని పోరాటాన్ని సాగిస్తున్నట్టు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ కేజీబీవీలోని ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రతినిధులు ఎస్వీ సూర్యనారాయణ, శ్రీనివాసరావు, రాంబిల్లి మండల అధ్యక్షుడు కిరణ్, కామరాజు, రమణబాబు, నాని, ధనుంజయ్, అప్పాజీ, నవీన్, సంజీవ్, అప్పలరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



జిల్లాస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులు

పరవాడ, జూలై 29 : యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నం కృష్ణ మందిర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో తానాం ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థినులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. దీంతో వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 10 నుంచి 12 సంవత్సరాల విభాగంలో జి.తేజశ్విని వెండి పతకం, తేజశ్రీ కాంస్య పతకం, 12 నుంచి 14 సంవత్సరాల విభాగంలో డి.హర్షిత బంగారు పతకం, బి.వైష్ణవి వెండి పతకం, ఎస్.కౌశిక కాంస్య పతకం సాధించారు. అలాగే 14 నుంచి 16 సంవత్సరాల విభాగంలో కె.హర్షిత బంగారు పతకం, కె.భావన వెండి పతకం, కె.వెంకట వైష్ణవి కాంస్య పతకం పొందారు. వీరంతా సెప్టెంబరులో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని యోగా ట్రైనీ ఆంజనేయులు తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

యోగాలో తుమ్మపాల విద్యార్థులకు పతకాలు



పతకంతో పాటు అవార్డు అందుకుంటున్న విద్యార్థిని, యోగా సెంటర్ ప్రతినిధి

తుమ్మపాల, జూలై 29 : విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా చాంపియన్‌షిప్ -2024లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ పోటీలకు 18 హాజరుకాగా గగనం ప్రసన్న, బి.జయశ్రీ, మాదేటి వైష్ణవి, బుదిరెడ్డి నరసింహారావులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను యోగా గురువు కర్రి జోగినాయుడు, గ్రామ నాయకులు కర్రి వెంకట సన్యాసినాయుడు, నడిపల్లి గణేష్, అజయ్, గ్రామ పెద్దలు అభినందించారు.

చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి

▸▸ జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంల సమావేశంలో డిప్యూటీ డీఈవో



హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం, జూలై 29 : చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చక్కగా తీర్చిదిద్దాలని ఎలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. ఇక్కడి ఎంఈవో కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సోమవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. వర్షా కాలం కావడంతో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణతో పాటు విద్యార్థుల చదువు విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అలాగే పాఠశాలలు, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఈవో ఏఎస్ఎస్ఏ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిని మృతిపై ఆందోళన



అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన

అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు సోమవారం ఆందోళన చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరపాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమిస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేజాక మధుబాబు, దళిత సంఘాల నాయకులు బోను గణేశ్, లంబ శ్రీను, రాజాన దొరబాబు, తట్టా సూరిబాబు, రాజు, బిల్లా శివ గణేశ్, జంప సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

కదలని పనులు.. కష్టాల్లో జనులు..

▸▸ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అనకాపల్లి పట్టణంలోని స్టేషన్ రోడ్డు విస్తరణ ▸▸ ఆరు నెలల వ్యవధిలో పూర్తిచేస్తామని ఆరంభం ▸▸ ఏడాది గడిచినా పట్టించుకునేవారు కరువు



రాళ్లు తేలిన స్టేషన్‌రోడ్డులో అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనచోదకులు

అనకాపల్లి టౌన్, జూలై 29 : జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. గత ఏడాది జూన్‌లో జీవీఎంసీ అధికారులు ఈ విస్తరణ పనులను చిన నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు ప్రారంభించారు. ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేసి రహదారిని సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని అప్పట్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకటించారు. అయితే ఏడాది అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా పనులు ఉన్నాయి. ఈ కారణంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో విస్తరణ పనుల్లో భాగంగా పలు భవనాలను తొలగించినప్పుడు డెబ్రిస్ రోడ్డుపైనే ఉండిపోయింది. దీనికి తోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా ఇటుగా ప్రయాణాలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల రహదారి గోతులమయమైంది. అందులో వర్షపు నీరు చేరుతుండడంతో ఇది గుర్తించలేని పలువురు ద్విచక్ర వాహనచోదకులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. పగలు ఎలాగున్నా రాత్రివేళ మాత్రం ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నామని పలువురు వాపోతున్నారు.

జిల్లా కేంద్రం కావడంతో ఈ స్టేషన్ రోడ్డుపై రద్దీ పెరిగింది. ఈ మార్గంలోనే కిరాణా దుకాణాలు, విద్యుత్ పరికరాల దుకాణాలు, సినిమా థియేటర్, అల్పాహారం హోటళ్లు, వస్త్ర దుకాణాలు వంటివి ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలతో ఈ రోడ్డు ఎప్పుడూ సందడిగా ఉంటుంది. దీనికితోడు ఈ రైల్వే స్టేషన్‌కు అనకాపల్లి పట్టణం, గవరపాలెం ప్రాంతవాసులతో పాటు పరవాడ మండలానికి చెందిన ప్రజలు కూడా ఈ మార్గం ద్వారానే చేరుకుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంతో అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలావుంటే, ఈ రహదారి విస్తరణ పనులను ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, పట్టణ ఏసీపీ రామకృష్ణలను వివరణ కోరగా, ఈ మార్గంలో ఆస్తులు కోల్పోయిన వారిలో 52 మందికి (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్' టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు సెంట్రల్ ఆఫీస్‌లో టీడీఆర్‌ల లాగిన్ ఆగిపోవడంతో సమస్య తలెత్తినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే వెంటనే వీరికి టీడీఆర్‌లను ఇస్తామని తెలిపారు. విస్తరణ పనులను కూడా వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.



విస్తరణ పనుల్లో భాగంగా అడ్డంకిగా ఉన్న భవనాల ముందు భాగాలను తొలగించిన దృశ్యం

దేవదాయ శాఖ భూమికి రక్షణ కల్పించాలి

▸▸ కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులు ధర్నా

▸▸ కబ్జాదారుల కోరల్లోంచి రక్షించాలని డిమాండ్

తుమ్మపాల, జూలై 29 : అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న సీతారామ చంద్ర స్వామి దేవస్థానం భూములకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో ఉన్న పూల్‌బాగ్ రోడ్డులో రాణిగారి పూలతోట సర్వే నంబరు 66లో సుమారు 29.71 ఎకరాల దేవస్థానం భూమి ఉందన్నారు. ఈ భూమిని 1957 జూలై 20న చెముడు ఎస్టేట్ మహారాణి వైరిచెర్ల చంద్రముఖి మహాదేవి సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఈ భూమి దేవస్థానం ఆధీనంలో ఉందని వివరించారు. అయితే సుమారు రూ.1100 కోట్లు విలువైన ఈ భూమిపై కొంతమంది కబ్జాదారుల కన్ను పడడంతో భూమిని కాజేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సైతం ఈ భూమిపై కోర్టులో వాదోపవాదాలు జరిగిన పిమ్మట ఈ భూమి దేవస్థానానికి చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కబ్జాదారులు పట్టించుకోవడం లేదన్నారు. తాజాగా భూమి చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి ఈ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు ఈ భూమి పూర్వపరాలు పరిశీలించి కబ్జాదారుల కోరల్లోంచి రక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, అల్లు రాజు, కాళ్ల తేలయ్య, గంటా సుభాషిణి, గండి నాయనబాబు, డీడీ వరలక్ష్మి, కొల్లి సత్యారావు, డి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

సబ్బవరం రెవెన్యూలో అక్రమ లే-అవుట్‌పై ఫిర్యాదు

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం రెవెన్యూ పరిధిలో అక్రమ లే-అవుట్ ఏర్పాటు చేసి, క్రయ విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇరువాడకు చెందిన బలిరెడ్డి అప్పారావు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కోరారు. ఈ మేరకు ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ ఏవో షేక్ బాబూరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరం సర్వే నెంబరు 274 (ప్రైవేటు భూమి)లో ఓ వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా లే-అవుట్ వేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. దీనిపై తాను ఆర్టీఐ యాక్టు ద్వారా తాను సమాచారాన్ని సేకరించినట్టు చెప్పారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

రాంబిల్లి పంచాయతీలో సమస్యలపై వినతి

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లి పంచాయతీలో సమస్యలపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు సోమవారం ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబిల్లిలో ప్రతి మంగళవారం వారపుసంత జరుగుతుందన్నారు. సంత మార్కెట్ నేవీ రోడ్డుమీద వరకు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నట్టు చెప్పారు. అలాగే, పంచాయతీలో పారిశుధ్య సిబ్బంది కొరత కారణంగా ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి ప్రజా సంఘాల అభివృద్ధి వేదిక అధ్యక్షుడు భూపతి అప్పారావు, సంఘం ప్రతినిధులు కె.వి.రమణ, వై.శ్రీనివాసరావు, సిహెచ్.రామకృష్ణ, సూరిబాబు, నూకరాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్షాల ఆందోళన

అనకాపల్లి టౌన్, జూలై 29 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌పై సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద గల మునిసిపల్ మస్టర్ పాయింట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకమైనదిగా ఉందన్నారు. బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు లేవని, కొత్తగా ఉపాధి కల్పించడానికి తీసుకువచ్చిన అంశాలు ఆచరణలో కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చి పెడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డి.రాము, సంతోష్, వాసు, పోలరావు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలోని గవరపాలెంలో నిరసన

నక్కపల్లి : బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించిందని, ఈ రంగానికి కేటాయింపులు పెంచి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నక్కపల్లిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సీఐటీయు మండల కన్వీనర్ ఎం.రాజేశ్‌లు నిరసన తెలిపి మాట్లాడారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేస్తామని పార్లమెంటులో హామీ ఇచ్చి బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేసిందని మండిపడ్డారు. అనంతరం జరిగిన నిరసన ర్యాలీలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల) : కేంద్ర బడ్జెట్ రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మునగపాకలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాల వారికి మరోసారి అన్యాయం చేసిందని ఆరోపించారు. రైతు సంఘం నాయకులు బ్రహ్మాజీ, రాము, రమణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: పంటలకు మద్దతు ధర ప్రకటిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ అందుకు విరుద్ధంగా వ్యవహరించి రైతుల నడ్డి విరుస్తున్నారని రైతు సంఘం ప్రతినిధులు ఆరోపించారు. హరిపాలెంలో సోమవారం కేంద్రం బడ్జెట్ ప్రతులను దహనం చేసి మాట్లాడారు. వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి, సామాన్యులపై భారం పెరిగే బడ్జెట్‌ను రూపొందించారని ఆరోపించారు. ఇది కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్‌గా ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, శరగడం ఆదిబాబు, సూరిబాబు, బత్తిన సింహాచలం, టి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సహపంక్తి భోజనాలు

పాయకరావుపేట, జూలై 29 : శిక్షా సప్తాహ ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులతో కలిసి కూటమి నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. స్కూల్ హెచ్ఎం భవానీ, వార్డు సభ్యుడు మలిపెద్ది వెంకటరమణ, ఎంపీటీసీ ఎం.రమాకుమారితో పాటు జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, టీడీపీ నాయకులు పల్లా విలియంకేరి, యాళ్ల సన్నబాబు, మహేష్, పెదిరెడ్డి పండు, వేములపూడి అప్పారావు, కట్టా శ్రీను, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పరవాడ : శిక్షా సప్తాహ కార్యక్రమం ముగింపోత్సవాన్ని పరవాడ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎంఈవో దివాకర్‌రావు, పైలా సన్యాసిరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు పైలా చిన అక్కునాయుడు, బీజేపీ నాయకుడు కూండ్రపు సోమునాయుడు, హెచ్ఎం అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, వాడచీపురుపల్లి హైస్కూల్‌లో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు సహకారంతో 450 మంది విద్యార్థులకు స్వీట్లు, మజ్జిగను అందించారు. వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, హెచ్ఎం కనకేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : శిక్షా సప్తాహ ముగింపు సందర్భంగా సోమవారం స్థానిక జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో తిథి భోజన్ కార్యక్రమం కింద విద్యార్థులందరికీ భోజనాల్లో రోటరీక్లబ్ ప్రతినిధులు డ్రైఫ్రూట్స్ ప్యాకెట్లను అందజేశారు. విద్యార్థులతో పాటు రోటరీ ప్రతినిధులు రాజేష్, అనిల్, పెంటకోట జగన్నాథం, బొగ్గారపు సర్వారావు, హెచ్ఎం కె.రుదిరా రాణి, రామచంద్రరావు, ఎస్ఎంసీ చైర్మన్ హరికృష్ణ, సునీత, భవాని భోజనాలు చేశారు.



కోటవురట్ల మండలం రాజుపేట ఎంఈవో తదితరుల సహపంక్తి భోజనాలు

పాయకరావుపేట రూరల్, జూలై 29:- మండలంలోని అన్ని పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సోమవారం తిథి భోజనాలు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు చికెన్ కర్రీ, బిరియానీ, పులిహోరా, వివిధ రకాల స్వీట్లు, పండ్లు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు చించలపు గోవిందు, మాజీ ఎంపీటీసీ పెరుమళ్ళ శివకుమార్, పెంటకోట పాఠశాలలో టీడీపీ నాయకులు చిక్కాల శ్రీనువాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు గేదెల అప్పలరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : గొడిచెర్ల ఎంపీపీ స్కూల్‌లో మాజీ ఎంపీపీ వైబోయిన రమణ సోమవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పిల్లలకు తనవంతుగా బిర్యానీ, అరటిపండ్లు,స్వీట్లు పంపిణీ చేశారు. కూటమి నాయకులు నారాయణరావు, రాజబాబు, వారాగాంధీ, సతీశ్, తూము శివ, నల్లల రత్నాజీ, దివాణం, సాయి, గంగాధర్ పాల్గొన్నారు. చినతీనార్లలో ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య ఎంపీయుపీ స్కూల్ పిల్లలందరికీ భోజనం అందజేశారు.

ఎస్.రాయవరం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో శుభతిథి భోజన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పలువురు దాతలు సమకూర్చిన పండ్లు, స్వీట్లతో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాలను వడ్డించారు. సైతారుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రావి రమణబాబు సమకూర్చిన అరటి పండ్లతో నిర్వహించిన వడ్డింపు కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్, ఎంఈవో ఏఎస్ఎస్ఏ మూర్తి విద్యార్థులకు భోజనం వడ్డించారు. దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పండ్లను సర్పంచ్ సుహాసిని పంపిణీ చేశారు హెచ్ఎం జి.శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్ఎం సోమేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

కోటవురట్ల : రాజుపేట యూపీ స్కూల్‌లో హెచ్ఎం రావాడ నాని మణిమోహన్ ఆధ్వర్యంలో ఎంఈవోలు కె.రామారావు, జోషి, సర్పంచ్ గొట్టేడి వెంకటరమణ శిక్షా సప్తాహ ముగింపోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు సొంత నిధులతో చికెన్‌కర్రీ, బిర్యానీ, పులిహోర, స్వీట్లు, పండ్లు వంటివాటిని సమకూర్చారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీదేవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరావు అన్నారు. సోమవారం పేట బయ్యవరం పాఠశాలలో తిథి భోజన కార్యక్రమంతో పాటు మాజీ సర్పంచ్ గెంజి శ్రీనుతో కలిసి పాఠశాలకు ఫ్యాన్లను వితరణగా అందజేసి మాట్లాడారు. దాసరి రమణారావు విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. హెచ్ఎం బొడ్డేడ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, నాయకులు చినబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుప్తా, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నునపర్తి రజకులు వినతి

అచ్యుతాపురం, జూలై 29 : వంశపారంపర్యంగా కులవృత్తిని చేసుకొని జీవిస్తున్న తమకు న్యాయం చేయాలంటూ నునపర్తికి చెందిన రజకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాము వినియోగిస్తున్న చాకిరేవు గెడ్డ ప్రాంతం తమదంటూ కొందరు సర్వేలు చేయించి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని నల్లమారెమ్మ రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుప్పాడ ముసలి నాయుడు, తోకాడ రాజు తదితరులు కోరారు.

జనసేన నాయకుడికి గెడ్డం బుజ్జి పరామర్శ

నక్కపల్లి, జూలై 29 : ఉపమాక గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తోట అప్పారావును సోమవారం ఆ పార్టీ నాయకుడు గెడ్డం బుజ్జి పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన అప్పారావు నివాసానికి బుజ్జి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్, నాయకులు నల్లల రత్నాజీ తదితరులు ఉన్నారు.

'భద్రతా ప్రమాణాలు పట్టని స్మైలెక్స్ ఫార్మా'

పరవాడ, జూలై 29 : ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మా యాజమాన్యం భద్రతా ప్రమాణాలను గాలికొదిలి కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఈ పరిశ్రమలో వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ భద్రత కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటి వరకు మూడుసార్లు ప్రమాదాలు జరిగి, ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వాపోయారు. పరిశ్రమలో కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనాలు కార్మికులకు చెల్లించడం లేదని ఆరోపించారు. పరిశ్రమలో భద్రతా ఆడిట్ నిర్వహించాలని, అలాగే యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మడుతూరులో పారిశుధ్య పనులు పరిశీలన



మడుతూరులో కాలువను పరిశీలిస్తున్న సురేష్ కుమార్

అచ్యుతాపురం, జూలై 29 : మడుతూరులో పారిశుధ్య పనులను విస్తృతంగా చేపడుతున్నారు. వీటిని సోమవారం ఎంపీడీవో సురేష్‌కుమార్ పరిశీలించారు. వర్షాల కారణంగా గ్రామంలో పారిశుధ్యం క్షీణించిందని జనసేన వీర మహిళ మోటూరు శ్రీవేణి చేసిన ఫిర్యాదుపై ఆయన వెంటనే స్పందించి పైవిధంగా చర్యలు చేపట్టారు.

పరవాడ : మండల వ్యాప్తంగా సోమవారం అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు పర్యవేక్షణలో గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. రహదారుల పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగించారు ఈ కార్యక్రమాల్లో ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

సబ్బవరం, జూలై 29 : మండలంలోని పలు గ్రామాల్లో జనసేన సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోంది. సబ్బవరం, అసకపల్లి, మలునాయుడుపాలెం, ఆరిపాక, పైడివాడ, పైడివాడఅగ్రహారం, నంగినారపాడు తదితర గ్రామాల్లో ఆ పార్టీ మండల నాయకులు కర్రి కనకరాజు, ఇందలి వెంకటరణ, బలిరెడ్డి అప్పారావు, బంతికోళ్ల పద్మ, గండి దుర్గాప్రసాద్ తదితరులు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపడుతున్నారు.

'వ్యాపారవేత్త కాశీ సేవలు చిరస్మరణీయం'



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ తదితరులు

అనకాపల్లి టౌన్, జూలై 29 : ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు, తూర్పుకాపు సంఘం సలహాదారుడు దివంగత కోరుకొండ కాసులు (కాశీ) సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కోట్నీవీధి సీతారామ కల్యాణ మండపం వద్ద సోమవారం ఏర్పాటైన సంస్మరణ సభలో పలువురు మాట్లాడారు. పేదల కోసం కాశీ ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, తలారి లక్ష్మీప్రసాద్, మలసాల రమణారావు, దిండి జగ్గఅప్పారావు, కోటిపల్లి జేజిబాబు, కోట్ని రాంబాబు, పలకా రాము పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

చీడికాడ, రామచంద్రపురం గ్రామాల్లో
120 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హరిప్రవీణ్

కృష్ణాదేవిపేట, జూలై 29 : గొలుగొండ మండలం తాళ్ల చీడికాడ, రామచంద్రపురం గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.హరిప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది 120 మందికి వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వ్యాధులు సోకకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

వైసీపీ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే సాయం

నాతవరం, జూలై 27 : గత అసెంబ్లీ ఎన్నికల్లో గాయపడిన వైబీ పట్నం గ్రామానికి చెందిన చుక్కా రాంబాబుకు సోమవారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ సోమవారం రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్లి వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం

▸▸ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు ఆర్డీవో సూచన



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జూలై 29 : కూటమి ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం సూచించారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో స్వయంగా మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు తమ సమస్యలను వివరించారు. అత్యధికంగా మునిసిపాలిటీలో డ్రైనేజీ సమస్య, పింఛన్ల మంజూరు కోరుతూ అర్జీలను అందజేశారు. మూడో వార్డుకు చెందిన నాగులాపల్లి రామారావు సర్వే నెంబరు 109/4లో నలభై సెంట్ల స్థలంలో రోడ్లు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. బ్యాంక్ కాలనీలో నీరు నిల్వ ఉండిపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని అక్కడివారు విన్నవించారు. ఇలా మరికొందరు సమస్యలను తెలియజేశారు. వీటి పరిష్కారానికి ఆయా అధికారులు కృషి చేయాల్సిందిగా ఆర్డీవో వారికి సూచించారు.

తూటిపాల పాఠశాలలో
అంతర్జాతీయ పులుల దినోత్సవం



పాఠశాలలో జంతువుల ఫొటోలతో విద్యార్థుల ప్రదర్శన

మాకవరపాలెం, జూలై 29 : తూటిపాల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము మాట్లాడుతూ ఏటా జూలై 29వ తేదీన పులుల దినోత్సవాన్ని జరుపుతున్నారన్నారు. పులుల సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు పులుల వేషాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో భోజనాల పండగ

▸▸ శిక్షా సప్తాహ్ ముగింపోత్సవం సందర్భంగా దాతల సాయంతో విద్యార్థులకు ఏర్పాటు



వెంకునాయుడుపేట పాఠశాలలో సహపంక్తి భోజనాలు

నర్సీపట్నం, జూలై 29 : శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపోత్సవంలో భాగంగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో సోమవారం శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మాంసాహారం, బూరెలు, గారెలతో భోజనం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్‌లు పిల్లలతో సహపంక్తి భోజనం చేశారు. ఎరకన్నపాలెం ఎంపీపీస్కూల్‌లో సుర్ల వరహాలబాబు, నాగరత్నం దంపతులు స్వీట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కొత్తవీధి ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం అడిగర్ల వరహాల నాయుడు, దుగ్గాడ ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం రమేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు.

మర్రిపాలెం పాఠశాలలో...

నాతవరం: మర్రిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో పోషక విలువలతో కూడిన భోజనం ఏర్పాటు చేశారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు దినోత్సవం సందర్భంగా పిల్లలకు త్రినాథ్, కృష్ణ, బోత్సా కృష్ణ, వరహాలు తదితరుల సహకారంలో డ్రైఫ్రూట్స్, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎల్‌పురం పాఠశాలలో ఎన్నికల సందడి

ఎస్‌పీఎల్‌లతో పాటు లేడీ రిప్రజెంటేటివ్‌లను ఎన్నుకున్న విద్యార్థులు

కృష్ణాదేవిపేట, జూలై 29 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్) ఎన్నికలు నిర్వహించారు. ఎస్‌పీఎల్-1, ఎస్‌పీఎల్-2, లేడీ రిప్రజెంటేటివ్ స్థానాలకు పది మంది విద్యార్థులు పోటీలో నిలవడంతో కోలాహల వాతావరణం నెలకొంది. పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని పదో తరగతి విద్యార్థులను పోటీ చేయవద్దని ఉపాధ్యాయులు సూచించారు. దీంతో ఎనిమిది, తొమ్మి తరగతి విద్యార్థులు పోటీపడ్డారు. మొత్తం 700 మంది విద్యార్థులుండగా 641 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కసిపల్లి అనూష (తొమ్మిదో తరగతి) ఎస్‌పీఎల్‌గా, సెకండ్ ఎస్‌పీఎల్‌గా ముప్పల హేమకిరణ్ (తొమ్మిదో తరగతి), లేడీ రిప్రజెంటేటివ్‌గా అనిమిరెడ్డి మాధురి ఎన్నికైనట్టు హెచ్‌ఎం ప్రకటించారు. ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులు టీవీ రమణ, రామరాజు, రామ్‌కుమార్, లోచల రమేష్, అచ్చిబాబు, ప్రసాద్, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

మాకవరపాలెం, జూలై 29 : తామరం, మాకవరపాలెంతో పాటు మరికొన్ని గ్రామాల్లోని పారిశుధ్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పారిశుధ్య పనులు సాగక అంతా ఇబ్బంది పడేవారు. ఇది గుర్తించిన కొత్త పాలకులు ఈ రకమైన చర్యలు చేపట్టడంతో గత వారంతో రోజులుగా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన పూడిక కదులుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగిని మృతిపై ఆందోళన



అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన

అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు సోమవారం ఆందోళన చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరపాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమిస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, దళిత సంఘాల నాయకులు బోను గణేశ్, లంబ శ్రీను, రాజాన దొరబాబు, తట్టా సూరిబాబు, రాజు, బిల్లా శివ గణేశ్, జంప సీతారాం తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ డెయిరీ, ట్రస్టుపై ప్రభుత్వం విచారణ జరిపించాలి'



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వెంకటరమణ, సత్యనారాయణ

నాతవరం, జూలై 29 : విశాఖ డెయిరీ, ట్రస్టుపై ప్రభుత్వం విచారణ జరిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ కోరారు. సోమవారం ఇక్కడ మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ డెయిరీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు ఆ పార్టీలోకి వెళ్లాక డెయిరీ, ట్రస్టు నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో చాలా సొసైటీల్లో డబ్బులు లేవన్నారు. గత ఐదేళ్లకు ముందు సదరు సంస్థ ఏటా సంక్రాంతికి, ఏరువాకకు పాడి రైతులకు బోనస్‌లు ఇచ్చేదన్నారు. అయితే ఆ తర్వాత ఏరువాక బోనస్ పూర్తిగా ఇవ్వలేదన్నారు. అలాగే పాడి రైతులకు వివిధ సందర్భాలలో పాల క్యాన్లు, దుప్పట్లు వంటివి ఇచ్చేవారని, చాలా కాలం నుంచి ఇవన్నీ ఇవ్వడం మానేశారని పేర్కొన్నారు. అదేవిధంగా విశాఖ డెయిరీ ఆస్పత్రిలో గత కొంత కాలంగా పాడి రైతులకు సరిగా వైద్య సేవలు అందడం లేదని వాపోయారు. నర్సీపట్నంలో సదరు సంస్థకు సంబంధించి ఐదెకరాల స్థలం ఉందన్నారు. ఇందులో విశాఖ డెయిరీ ఆస్పత్రి నిర్మిస్తే ఈ ప్రాంత పాడి రైతులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో సరుగుడు సర్పంచ్ గంగరాజు, కొండబాబు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో సీపీఎం జిల్లా మహాసభలు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న సీపీఎం, ఐద్వా నాయకులు

నర్సీపట్నం, జూలై 29 : పట్టణంలో మొట్టమొదటి సారిగా డిసెంబరు 8, 9 తేదీల్లో సీపీఎం జిల్లా మహా సభలు నిర్వహించనున్నామని ఆ పార్టీ నాయకుడు అడిగర్ల రాజు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కేవలం భూ సమస్యలపైనే కాకుండా మన్యం, మైదాన ప్రాంతాల గిరిజనుల సమస్యలు, కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు సాగిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన స్మార్ట్ విలేజ్ సంస్థ అక్రమాలు వెలుగులోకి తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈర్లె చిరంజీవి, ఐద్వా నాయకురాళ్లు ఎల్.గౌరీ, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం



విద్యార్థులకు నగదు బహుమతి అందచేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

బ్రాహ్మణుల సంక్షేమానికి చేయూత

చోడవరం, జూలై 29: బ్రాహ్మణుల సంక్షేమానికి చేయూతనిస్తామని గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు చైర్మన్ కందర్ప కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గణేష్ గాయత్రి బ్రాహ్మణసేవా ట్రస్టు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై వివరించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కోరిమిల్లి వెంకట ప్రణీత్, పి.వెంకట శ్రావ్యలకు నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పుటేప్రు శ్యామ్, వింజమూరి శంకర్, కందర్ప సత్యనారాయణ, రమేష్, ఉపాధ్యాయుల శ్రీనివాస్, కొమ్మనమంచి నరసింహమూర్తి, గుంటూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా సహకార సంఘాల
ఉద్యోగుల సంఘం కన్వీనర్‌గా జగన్మోహనరావు

చోడవరం, జూలై 29: జిల్లాలోని సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్‌గా బుచ్చెయ్యపేట మండలం విజయరామజారుపేట సహకార సంఘం సీఈవో బొడ్డేడ జగన్మోహనరావు ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సహకార సంఘాల ఉద్యోగుల జిల్లా సభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళిక రూపొందించారు.

డిగ్రీ కళాశాలలో పులుల సంరక్షణ దినోత్సవం

చోడవరం, జూలై 29: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జువాలజీ విభాగం ఆధ్వర్యంలో పులుల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, లెక్చరర్ నారాయణమూర్తి జీవావరణ వ్యవస్థ, జంతు సంరక్షణ, పులుల రక్షణ ఆవశ్యకతను వివరించారు. అలాగే విద్యార్థులకు పులులకు సంబంధించి క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు వి.రత్నభారతి పాల్గొన్నారు.

వడ్డాదిలో విద్యార్థులకు శుభదిన భోజనం

బుచ్చెయ్యపేట, జూలై 29: వడ్డాది మెయిన్ పాఠశాలలో సోమవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ విద్యార్థులకు శుభదిన భోజనం ఏర్పాటు చేశారు. 115 మంది విద్యార్థులకు స్వీట్లు, భోజనాలను స్వయంగా వడ్డన చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శేషగిరిరావు శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అన్ని అంశాలపై విజ్ఞానం అందించడంతో పాటు సామాజిక బాధ్యతను పెంచే విధంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యపురెడ్డి మాధవరావు, తలారి శంకరరావు, దొండా రమేష్, కోరుకొండ గురుమూర్తి, సింగంపల్లి రమేష్, ఏ.కనకరాజు, గంగరాజు పాల్గొన్నారు.

ఆగస్టు 4న మారథాన్

బుచ్చెయ్యపేట, జూలై 29: వడ్డాదిలో ఆగస్టు 4న రన్, వాక్ ఫర్ యాంటీ డ్రగ్స్ మారథాన్ నిర్వహించనున్నట్టు అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ తెలిపింది. హైస్కూల్ మైదానం నుంచి 2.5 కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొనే వారు 9505394884, 8099222215 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అయిల్‌ఫాం సాగుపై దృష్టిసారించాలి

రోలుగుంట, జూలై 29: ఆయిల్‌ఫాం సాగుపై రైతులు దృష్టిసారించాలని ఉద్యానవన శాఖాధికారి ఎస్.శిరీష సూచించారు. కె.నాయుడుపాలెంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ వారితో కలిసి సోమవారం పామాయిల్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, మొక్కలు, బిందుసేద్యం సంబంధిత రాయితీలను ప్రభుత్వం అందిస్తున్నదని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ గుములూరు చంద్రమౌళి, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్లు

కె.కోటపాడు నుంచి పినగాడి వరకు రోడ్ల విస్తరణ

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి





కె.కోటపాడు: కార్యక్రమంలో మాట్లాడుతున్న బండారు... దేవరాపల్లి: టీడీపీ కార్యకర్తలకు నగదు పంపిణీ

కె.కోటపాడు/దేవరాపల్లి, జూలై 29: ప్రతీ గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో అధిక మెజార్టీ సాధించిన కార్యకర్తలకు ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడుతో కలిసి సోమవారం నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ చంద్రయ్యపేటలో రామాలయం, ఆర్లిలో శివాలయం వద్ద కళామందిర్ నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు సమకూర్చుతామన్నారు. కె.కోటపాడు నుంచి పినగాడి వరకు రోడ్లు విస్తరణ చేపడతామన్నారు. టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ సీఎం రమేష్ ఎన్నికల్లో మెజార్టీ ఇచ్చిన కార్యకర్తలకు రూ.లక్ష నగదును అందించడమే దీనికి నిదర్శనమని బండారు పేర్కొన్నారు. సీఎం సురేష్‌నాయుడు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందన్నారు. మాడుగుల నియోజకవర్గం అభివృద్ధికి పరిశ్రమలు రావాలని, తద్వారా ఉపాధి అవకాశాలు అందరికీ దక్కుతాయని చెప్పారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ, బీజేపీ నాయకులు రొంగలి మహేష్, కొటాన ఈశ్వరరావు, కిలపర్తి భాస్కరరావు, సూర్యనారాయణ, సబ్బవరపు పుష్పవతి, సబ్బవరపు రామునాయుడు, దాడి ఎరుకునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, లెక్కల అవతారం, పూడి నారాయణమూర్తి, డోకల నరసింహమూర్తి, పోతల పాత్రునాయుడు, రామ్మూర్తి నాయుడు, బుదిరెడ్ల అప్పారావు, గుమ్మడి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

రావికమతం, జూలై 29: పాడి పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని తట్టబంద పశువైద్యాధికారి జి.ఎస్.నూకేశ్వరరావు సూచించారు. కవ్వగుంట గ్రామంలో సోమవారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకరజాతి, దేశవాళీ ఆవులకు, దుక్కిటెద్దులకు ప్రాణాంతకమైన ముద్ద చర్మ వ్యాధితో పెను ముప్పు పొంచి ఉందన్నారు. ఈ వ్యాధి వల్ల పశువులకు చర్మంపై పెద్ద బిల్లలు మాదిరిగా ఏర్పడడం, తీవ్రంగా జ్వరం వచ్చి పశువు నీరంచి మరణించడం జరుగుతుందన్నారు. అలాగే పశువుల్లో పాల దిగుబడి తగ్గిపాడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుందన్నారు. అందువల్ల పాడి రైతులు విధిగా లంపిస్కిన్ వ్యాధి నిరోధిక టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు. కవ్వగుంట గ్రామంలో 68 మంది రైతులకు చెందిన 96 పశువులకు ఈ టీకాలు వేశామని ఆయన తెలిపారు. సర్పంచ్ దాసరి సూర్యకుమారి, పశు వైద్య సిబ్బంది దేముడు, వరహాలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఏడు మేకలు మృతి



మృతి చెందిన ఏడు మేకలు వద్ద రోదిస్తున్న పెంపకందారులు

రావికమతం, జూలై 29: వీధి కుక్కల దాడి చేయడంతో ఒకే గిరిజన రైతుకు చెందిన ఏడు మేకలు మృతి చెందగా, మరో పదిమేకలను తీవ్రంగా గాయపడ్డాయి. గుడ్డిప పంచాయతీ శివారు జి.గదబూరు గ్రామంలో అధిక శాతం గిరిజనులు మేకల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నారు. ఎప్పటి మాదిరిగానే చింతా చంద్రయ్య తన 150 మేకలను ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలోని దొడ్డిలో పెట్టి తలుపు వేశాడు సోమవారం తెల్లవారు జామున కుక్కల చొరబడి దాడి చేయడంతో ఏడు మేకలు మృత్యువాత పడ్డాయి. మిగిలిన మేకలు అరవడంత యజమాని చంద్రయ్య, కుటుంబ సభ్యులు హుటాహుటిన వెళ్లి కుక్కలను బెదిరించడంతో మిగిలిన మేకలకు అపాయం తప్పింది. కుక్కలను నివారించాలని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు చంద్రయ్య వేడుకున్నాడు.

ఎమ్మెల్యే రాజును కలిసిన ప్రిన్సిపాల్ అన్నపూర్ణ

బుచ్చెయ్యపేట, జూలై 29: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.వి.అన్నపూర్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే రాజు సూచించారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని కూలీల నిరసన



ఖాళీ కంచాలు, గ్లాసులతో నిరసన తెలుపుతున్న కూలీలు

దేవరాపల్లి, జూలై 29: ఉపాధి హామీ పథకం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వాలాబులో కంచాలు, గ్లాసులు పట్టుకుని కూలీలు వినూత్న నిరసన తెలిపారు. తిండైనా పెట్టండి.. బకాయిలైనా చెల్లించండి అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర మాట్లాడుతూ ఎనిమిది వారాల వరకు రూ.80 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. సమ్మర్ అలవెన్సులు లేవు సరికదా ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో తగ్గించారన్నారు. నాయకులు ఈశ్వరరావు, కె.రాముదుర్గా పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో సీసీ కెమెరాలు



రోలుగుంట మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

రోలుగుంట, జూలై 29: మండల రెవెన్యూ కార్యాలయంలోని రికార్డుల గది వద్ద సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తగలబెట్టిన ఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సోమవారం ప్రత్యేకంగా రెవెన్యూ రికార్డులు ఉన్న గది లోపల ఒక సీసీ కెమెరా, గది వెలుపల మరో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను నిత్యం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. నిత్యం సీసీ పుటేజీలు రికార్డు అయ్యే విధంగా కంప్యూటర్ గదిలో ప్రత్యేకంగా కంప్యూటర్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంలో రాత్రి వేళ పర్యవేక్షించేందుకు వీఆర్‌ఏలను కూడా నియమించారు.

జిల్లా కోఆర్డినేటర్ 'శుభదిన' పరిశీలన



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ శకుంతుల

కె.కోటపాడు, జూలై 29: మండలంలోని గొండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం శుభదిన భోజన కార్యక్రమాన్ని జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ శకుంతల పరిశీలించారు. సర్పంచ్ బండారు లక్ష్మణరావు, గ్రామ నాయకులు చిన్నదొర, చిరికి మహేష్, మాస్టరు బండారు వెంకటరమణమూర్తి, వంటాకు చిన్ననాయుడు సాయంతోవిద్యార్థులకు మిఠాయిలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం కోటపాడు జడ్పీ పాఠశాలను కోఆర్డినేటర్ శకుంతుల సందర్శించారు.

మాడుగుల
నియోజకవర్గం

విద్యార్థులకు సమగ్ర అనుభవాలు అందించడమే శిక్ష సప్తాహ్ లక్ష్యం

చీడికాడ, జూలై 29: విద్యార్థులకు సమగ్ర విద్య అనుభవాలను అందించడానికే శిక్ష సప్తాహ్ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి చెప్పారు. ఉత్సవాల చివరి రోజు సోమవారం నిర్వహించిన శుభదిన భోజనం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు రోజువారి భోజనానికి అదనంగా పండ్లు అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో పారిశుధ్య పక్షోత్సవాలు

కె.కోటపాడు, జూలై 29: మండల కేంద్రంలో సోమవారం పారిశుధ్య పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సర్పంచులు, కార్యదర్శులు, పారిశుధ్య కమిటీల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తారన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ, వెలుగు సిబ్బందితో ర్యాలీ చేశారు. సీడీపీవో మంగతాయారు, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

చీడికాడ, జూలై 29: గిరిజన గ్రామాల్లో ప్రాణాంతకమైన దోమల నివారణకు స్ప్రేయింగ్ అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటరావు చెప్పారు. కోనాం శివారు వాకపల్లి, పనసగెడ్డ, ఎస్.గదబూరు గ్రామాల్లో సోమవారం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్ పేరునాయుడు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శాకంబరి అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

మాడుగుల, జూలై 29: మోదకొండమ్మ అమ్మవారిని మంగళవారం శాకంబరిగా అలంకరించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి అమ్మవారి దర్శనానికి తరలిరావాలని కోరారు.

కింతాడలో ఇసుక లారీ పట్టివేత



దేవరాపల్లి, జూలై 29: మండలంలోని కొత్తూరు వద్ద వద్ద ఇసుక లారీని టీడీపీ నాయకులు కొమార బాబూరావు, కోణ ఈశ్వరరావు సోమవారం అర్ధ రాత్రి పట్టుకున్నారు. బి.కింతాడ వద్ద శారదా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లారీని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు వారు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

చీడికాడ, జూలై 29: పరిసరాల పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యమివ్వాలని చీడికాడ వైద్యాధికారి సునీల్‌కుమార్ సూచించారు. మంచాల గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషన్‌లో భాగంగా పాలకేంద్రం వద్ద సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 28 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. అలాగే వాకపల్లి గ్రామంలో జరిగిన శిబిరంలో 18 మందికి తనిఖీలు చేయగా, ఇద్దరికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలం పూర్తయ్యేవరకూ కాచి ఒడబోసిన నీటినే తాగాలని సూచించారు. ఈ శిబిరాల్లో హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్‌లు సేవలందించారు.